క్లుప్తంగా

మెగా పేరెంట్స్ డే రేపు

రాజాం/వంగర/బాడంగి: మండలాల్లోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 7వ తేదీన మెగా పేరెంట్స్ డే నిర్వహిస్తున్నట్లు రాజాం, వంగర ఎంఈవోలు యాగాటి దుర్గారావు, ప్రవీన్‌కుమార్, బాడంగి ఎంపీడీవో ఎస్.రామకృష్ణలు గురువారం తెలిపారు. పాఠశాలల అభివృద్ధితో పాటు పాఠశాల ప్రగతిలో విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తుల భాగస్వామ్యం, విద్యార్థుల శతశాతం హాజరు, వారి సమస్యల పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించనున్నట్లు వారు తెలిపారు. ఇదే విషయమై వారు పలు పాఠశాలల ఉపాధ్యాయులతో ఉదయం సమావేశమై, పలు సూచనలు చేశారు.

38 సారా ప్యాకెట్ల స్వాధీనం

రేగిడి: మండలంలోని మీసాలడోలపేటలో సారా విక్రయిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. అనంతరం ఆయన వద్ద నుంచి 38 సారా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. సారా తయారు చేసినా, తరలించినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ ఆర్.జైభీమ్ హెచ్చరించారు.

ఫీవర్ సర్వే



సర్వే చేస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

రాజాం: మండలంలోని పెనుబాక గ్రామంలో బొద్దాం పీహెచ్‌సీ వైద్యాధికారిణి సిద్ధేశ్వరి తమ సిబ్బందితో కలిసి గురువారం ఫీవర్ సర్వే చేపట్టారు. జ్వర లక్షణాలతో బాధపడుతున్న వారి రక్త నమూనాలు సేకరించి, నిర్ధారణ పరీక్షల నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అనంతరం ప్రజలకు ఆరోగ్య సలహాలు, సూచనలు చేశారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించి, పౌష్టికాహారం తింటే ఏ రోగాలు మన దరిచేరవన్నారు.

'ఉపాధి' పనుల ప్రారంభం

రేగిడి: మండలంలోని అప్పాపురం, మజ్జిరాముడుపేట, గోపింపేట గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనులు గురువారం ప్రారంభమయ్యాయి. జాబ్‌కార్డు ఉన్న వారందరికీ పనులు కల్పించాలని, వేతనదారులు కోరిన చోట, రైతులకు ఉపయోగపడేలా పనుల నిర్వహణ ఉండాలని ఏపీవో ఎస్.హరనాథరావు సూచించారు.

సర్వేను వేగవంతం చేయాలి



కంచరాంలో హౌస్‌హోల్డ్ సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

రాజాం: అన్ని పంచాయతీల్లో చేపడుతున్న హౌస్‌హోల్డ్ సర్వేను వేగవంతం చేయాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మండలంలోని కంచరాం, రాజయ్యపేట, పొగిరి తదితర గ్రామాల్లో గురువారం చేపట్టిన హౌస్‌హోల్డ్ సర్వేను ఆయన పరిశీలించి, పలు సూచనలు చేశారు. అన్ని గ్రామాల్లోనూ పారిశుధ్య పనులు చేపట్టాలని, ప్రజారోగ్యంపై దృష్టి సారించాలని తెలిపారు.

డిజిటల్ చెల్లింపుతోనే టికెట్లు ఇస్తామనడం సరికాదు



మాట్లాడుతున్న శంకరరావు, గోపాలం

బొబ్బిలి: డిజిటల్ చెల్లింపు చేస్తేనే రైల్వే ప్రయాణికులకు టికెట్లు ఇస్తామని చెప్పడం సరికాదని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పొట్నూరు శంకరరావు అన్నారు. స్థానిక రైల్వే స్టేషన్‌లో డిజిటల్ పేమెంట్ ద్వారా మాత్రమే టికెట్లు కేటాయిస్తుండడాన్ని ఆయన గురువారం తప్పుబట్టారు. చదువు రాని వారు, కూలి పనులకు వెళ్లే వారి దగ్గర స్మార్ట్ ఫోన్లు లేకపోతే వారు ఎలా డిజిటల్ పేమెంట్ చేస్తారని ప్రశ్నించారు. డిజిటల్ పేమెంట్‌తో పాటు సాధారణ పేమెంట్‌లను కూడా తీసుకుని, టికెట్ ఇవ్వాలని కోరారు. రైల్వే శాఖలోని కొన్ని విభాగాలను కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే కొన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించిందని, ఇప్పుడు టికెట్ కౌంటర్లను కూడా ప్రైవేటుకు అప్పగించే యోచనలో ఉందని విమర్శించారు. ప్రజలను ఇబ్బంది పెట్టే పనులు మానుకోవాలని హితవు పలికారు. ఆయన వెంట సీపీఎం మండల కన్వీనర్ ఎస్.గోపాలం ఉన్నారు.

రైతు సమస్యలపై ప్రత్యేక దృష్టి

వంగర: రైతు సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని తహసీల్దారు దిరిశాల ధర్మరాజు సూచించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో గురువారం సమావేశమైన ఆయన.. శుక్రవారం నుంచి జరగనున్న రెవెన్యూ సదస్సుల్లో రైతుల భూ సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించాలని, తక్షణమే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో డీటీ హరి రమణారావు, వీఆర్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

విజృంభిస్తున్న దోమలు

- రాజాం మున్సిపాలిటీలో దోమల స్వైరవిహారం
- రోగాల బారినపడుతున్న ప్రజలు
- కనిపించని దోమల నివారణ చర్యలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం



దోమలు పెరగడానికి కారణమైన రాజాం పట్టణంలోని ఓ ప్రాంతంలోని మురుగునీటి కుంట

రాజాం సిటీ: రాజాం పట్టణంలోని అన్ని వార్డుల్లో దోమలు విజృంభిస్తున్నాయి. వాతావరణ మార్పులు, వర్షాల కారణంగా పెరుగుతున్న దోమల కారణంగా దోమకాటుతో ఏ వ్యాధులు ప్రబలుతాయోనని ప్రజలు తీవ్ర భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాలిటీలోని మొత్తం 24 వార్డులకు గాను ప్రతీ వార్డులోని ఖాళీ స్థలాల్లో నీరు ఎక్కువ రోజుల పాటు నిల్వ ఉండిపోవడమే దోమలు పెరిగేందుకు ముఖ్య కారణం. ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు ఇచ్చి, వాటిలో మట్టిని పూడ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉన్నప్పటికీ ఆ దిశగా ఏ ఒక్క అధికారి పట్టించుకోడం లేదనే సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వార్డు పర్యటనలు చేస్తున్నామంటూ గొప్పలు చెప్పుకొస్తున్న అధికారులు దోమల నివారణ చర్యలపై ఎందుకు దృష్టి సారించడం లేదని పలువురు వాపోతున్నారు. రోగాల బారినపడుతున్నా పట్టించుకోరా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఫాగింగ్ జాడ లేదు..

మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లోనూ ప్రతిరోజూ దోమలు పోయేందుకు ఫాగింగ్ చేయాల్సి ఉన్నప్పటికీ ఆ దిశగా చర్యలు లేకపోవడంపై అధికారుల తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. అలాగే మురుగు కాలువల్లో మలాథియన్ స్ప్రే చేయాల్సి ఉన్నా అదీ చేయడం లేదు. అయితే ఉన్నతాధికారులు వస్తున్నారని తెలిస్తే చాలు ఆ ప్రాంతంలో మాత్రమే హడావిడి చేసి, ఆ తర్వాత చేతులు దులుపుకుంటున్నారు. ఇదే విషయంపై పట్టణవాసులంతా బాహాటంగానే విమర్శలు చేస్తున్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తుండడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు.



మున్సిపల్ కార్యాలయంలో నిరుపయోగంగా ఫాగింగ్ యంత్రం

అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ..

దోమల పెరుగుదలకు మున్సిపాలిటీలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడమే ప్రధాన కారణంగా పట్టణవాసులు పేర్కొంటున్నారు. మున్సిపాలిటీ అభివృద్ధి నిధుల ద్వారా పట్టణాన్ని ఆధునీకరిస్తున్నామని చెప్పుకొస్తున్న అధికారులు మాత్రం డ్రైనేజీ వ్యవస్థను గాడిలో పెట్టేందుకు చర్యలు చేపట్టడం లేదు. ఫలితంగా రోడ్డు పక్కనే మురుగునీరు నిల్వ ఉండిపోయి దుర్గంధం వెదజల్లుతోందని జనం ఆందోళన చెందుతున్నారు.

ప్రజలపై భారం..

ప్రస్తుతం దోమల నుంచి కాపాడుకునేందుకు ప్రజలు మస్కిటో కాయిల్స్‌పై ఆధారపడుతున్నారు. రాత్రి చక్కగా నిద్రపోవాలంటే దోమల నివారణ పరికరాలు ఏమేమి ఉన్నాయో చూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. మస్కిటో కాయిల్స్, లిక్విడ్, అగరబత్తీలు తదితర వాటి కోసం సగటున రోజుకు రూ.10 వరకు వెచ్చించాల్సి వస్తోందని పట్టణవాసులు చెబుతున్నారు. ప్రభుత్వం, అధికారులు సంయుక్తంగా దోమల నివారణకు చర్యలు చేపడితేనే ప్రజలు సురక్షితంగా ఉండగలరు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి, దోమల నివారణకు ఫాగింగ్ చర్యలతో పాటు కాలువల్లో మలాథియన్ స్ప్రే చేయాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

కంటి మీద కునుకు లేదు..



దోమలు విపరీతంగా కుడుతున్నాయి. కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. అనారోగ్యం పాలవ్వాల్సిన దుస్థితి నెలకొంది. అధికారులు చొరవ తీసుకోవాలి. పూర్తి స్థాయిలో దోమల నివారణకు చర్యలు చేపట్టాలి. దోమల నివారణ మందు పిచికారీ చేయాలి.

– దోల అప్పలనాయుడు, దోలపేట

ఏ జ్వరం వస్తుందోనని భయం..



పట్టణంలో ఎక్కడికక్కడ మురుగునీటి నిల్వలు నెలకొనడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. పెరిగిన దోమల కారణంగా ఎప్పుడు ఏం జ్వరం వస్తుందోనని భయమేస్తోంది. మస్కిటో కాయిల్స్, అగరబత్తీల వాడకం పెరిగింది. అధికారులు స్పందించి, ప్రతిరోజూ ఫాగింగ్ చేపట్టాలి.

– బూరి శశిభూషణరావు, రాజాం

చర్యలు తీసుకుంటాం..



పట్టణంలో ఇప్పటికే అన్ని ప్రాంతాలకు కాలువల నిర్మాణం చేపట్టేందుకు చర్యలు చేపడుతున్నాం. వాస్తవానికి వర్షాకాలంలో నాలుగు నెలలు మాత్రమే ఫాగింగ్ చేసేందుకు అవకాశం ఉంది. 15వ ఆర్థిక సంఘం నిధుల ప్రాప్తికి మరోసారి పరిశీలించి, అన్ని ప్రాంతాల్లో ఫాగింగ్‌కు చర్యలు చేపట్టనున్నాం.

– జి.రామప్పలనాయుడు, కమిషనర్, రాజాం

నేలతల్లిని కాపాడుకుంటేనే మానవ మనుగడ



బొబ్బిలిరూరల్: రైతులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న వ్యవసాయ శాఖ ఏడీ శ్యామసుందర్



బొబ్బిలి: మొక్కలు నాటుతున్న బ్రహ్మకుమారీలు

బొబ్బిలిరూరల్: నేలతల్లిని కాపాడుకుంటేనే మానవ మనుగడ సాధ్యమని వ్యవసాయ శాఖ ఏడీ మజ్జి శ్యామసుందర్ అన్నారు. ప్రపంచ నేల దినోత్సవం సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న రైతు సేవా కేంద్రాల్లో విద్యార్థులకు క్విజ్ పోటీలు గురువారం నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేసిన అనంతరం ఆయన నేల ఆవశ్యకతను వివరించారు. నేల తనలోని సారమంతా సన్నగిల్లే వరకు మొక్కలను పెంచి, పోషించి భూమిపై ఉన్న మిగతా జీవరాశికి ఉపయోగపడేలా అందిస్తుందన్నారు. అటువంటి నేలతల్లిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అనంతరం నేలను కాపాడుతామని అందరితో ప్రతిజ్ఞ చేయించారు.

బొబ్బిలి: ప్రపంచ నేల దినోత్సవం సందర్భంగా స్థానిక పట్టణంలోని పలు ప్రాంతాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఓం శాంతి బ్రహ్మకుమారీస్ సంస్థ సభ్యులు గురువారం చేపట్టారు. రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించి, సేంద్రియ ఎరువుల వాడకం పెంచి నేలను కాపాడాలని కోరారు.

చోరీపై కేసు నమోదు

సంతకవిటి: మండలంలోని సిరిపురానికి చెందిన దేవబారికి పార్వతి తన ఇంట్లో జరిగిన రూ.10 వేల దొంగతనం(చోరీ)పై చేసిన ఫిర్యాదు మేరకు అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ ఆర్.గోపాలరావు గురువారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.. బుధవారం రాత్రి పొందూరు మండలంలోని కొంచాడ గ్రామంలో చర్చికి వెళ్లి, రాత్రి 11 గంటల సమయంలో ఇంటికి వచ్చింది. ఆమె తన ఇంటి తలుపులు తెరుస్తుండగా చీకటిలో మనిషి కదలికల చప్పుడు వినబడడంతో పాటు, డాబా స్లేడు పైనుంచి మేడ మీదకు వెళ్లాడు. ఆ తర్వాత ఆమె తన ఇంట్లోకి వెళ్లి చూడగా, బీరువా తలుపులు తెరిచి ఉండడం, అందులోని రూ.10 వేలు లేకుండా పోవడం వంటివి జరిగాయి. ఈ ఘటనపై ఆమె ఫిర్యాదు చేసిందని, ప్రస్తుతం దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు



రెవెన్యూ సిబ్బందికి సూచనలిస్తున్న తహసీల్దారు సత్యం

సంతకవిటి: రైతుల భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు బి.సత్యం తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వీఆర్‌వోలు, వీఆర్‌ఏలతో గురువారం సమావేశమైన ఆయన.. శుక్రవారం బొద్దూరులో ప్రారంభమయ్యే రెవెన్యూ సదస్సులు.. జనవరి 8వ తేదీన పుల్లిట గ్రామంలో చేపట్టే సదస్సుతో ముగుస్తాయన్నారు. ఈ సదస్సుల్లో సిబ్బంది దృష్టికి వచ్చిన ప్రతీ భూ సమస్య పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్వే డీటీ మధు, మండల సర్వేయర్ గోవిందరావు, ఆర్‌ఐ కృపారావు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలిరూరల్: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ శంబంగి లక్ష్మి ఆధ్వర్యంలో వీఆర్‌వోలతో బొబ్బిలి ఆర్డీవో జేవీఎస్ఎస్ రామ్మోహనరావు గురువారం సమావేశమై, రెవెన్యూ సదస్సులపై పలు సూచనలు చేశారు. శుక్రవారం నుంచి గ్రామాల్లో చేపట్టే సదస్సుల్లో రైతుల భూ సమస్యల పరిష్కారానికి వినతిపత్రాలు స్వీకరించి, వాటి పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు.

బాడంగి: గ్రామాల్లో శుక్రవారం నుంచి నిర్వహించే రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు కె.సుధాకర్ కోరారు. ఈ సదస్సుల్లో రైతుల భూ సమస్యలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఇదే విషయమై ఆయన స్థానిక తహసీల్దారు కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు.

సంక్షిప్తంగా...

మూడు లారీల సీజ్

బొబ్బిలి: స్థానిక గ్రోత్ సెంటర్ మీదుగా పరిమితికి మించిన లోడు(ఓవర్ లోడు)తో వెళ్తున్న మూడు లారీలను పోలీసులు గురువారం సీజ్ చేశారు. అనంతరం విజయనగరం రవాణా అధికారి దుర్గాప్రసాద్‌కు సమాచారం ఇవ్వగా, ఆయన వచ్చి ఆయా వాహనాలను పరిశీలించారు. 23 టన్నుల లోడు కలిగిన రెండు లారీలకు రూ.66 వేల చొప్పున, 11 టన్నుల లోడు కలిగిన లారీకి రూ.42 వేలు అపరాధ రుసుం విధించినట్లు సీఐ కె.సతీష్‌కుమార్ తెలిపారు.

సీసీ కెమెరాల ఏర్పాటు

సంతకవిటి: స్థానిక బస్టాండ్ జంక్షన్ వద్ద సీసీ కెమెరాలు గురువారం ఏర్పాటు చేశారు. బస్టాండ్ పరిసరాల్లో తరచూ రాత్రి సమయాల్లో దొంగతనాలు జరుగుతుండడంతో సీసీ కెమెరాల ఏర్పాటుకు అక్కడి షాపుల యజమానులకు సూచించడం జరిగిందన్నారు. ఈ మేరకు వారంతా కలిసి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకున్నారని ఎస్‌ఐ ఆర్.గోపాలరావు తెలిపారు.

మెనూ అమలు చేయకపోతే చర్యలు

తెర్లాం: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం మెనూ సక్రమంగా అమలు చేయకపోతే చర్యలు తప్పవని ఎంఈవో త్రినాధరావు హెచ్చరించారు. మండలంలోని జన్నివలస ప్రాథమిక పాఠశాలను ఆయన గురువారం సందర్శించి, పలు సూచనలు చేశారు. పాఠశాల ప్రారంభ సమయానికి పాఠశాలకు వచ్చి, ప్రార్థనలో పాల్గొన్నాలని విద్యార్థులు, సిబ్బందికి సూచించారు. అపార్ నమోదును త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. మెగా పేరెంట్స్ సమావేశానికి ఉపాధ్యాయులు ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. రికార్డులు సక్రమంగా నిర్వహించాలన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

వంగర: మహిళలు ఆర్థికంగా ఎదగాలని సీసీ జె.బాలు ఆకాంక్షించారు. మండలంలోని తలగాం గ్రామ సచివాలయంలో గ్రామైక్య సంఘ సమావేశం గురువారం నిర్వహించారు. మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలని, వెలుగు ద్వారా అందిస్తున్న స్త్రీనిధి, హెచ్‌డీపీ, సీఐఎఫ్, ఎంకేఎస్పీ, ఉన్నతి రుణాలు సద్వినియోగం చేసుకుని, ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు.

చిన్నారులకు వ్యాక్సిన్‌లు

రేగిడి: మండలంలోని రేగిడి, ఉంగరాడమెట్ట, కేఎం వలస, చాటాయివలస తదితర గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు వ్యాక్సిన్లు వేసే కార్యక్రమం గురువారం చేపట్టారు. చిన్నారులకు వేయాల్సిన వ్యాక్సిన్లను క్రమం తప్పకుండా వేయించాలని రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారి అసిరినాయుడు సూచించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కొటియాపై మంచు దుప్పటి



ఒడిశా సరిహద్దు ప్రాంతమైన కొటియాను దట్టంగా కురుస్తున్న పొగమంచు కప్పేస్తోంది. గత మూడు రోజులుగా గంజాయిభద్ర తదితర గ్రామాల్లో విపరీతంగా మంచు కురుస్తోంది. గురువారం సైతం ఏర్పడిన ఈ విభిన్న వాతావరణంతో ఓ వైపు ఆహ్లాదం.. మరోవైపు చలి ఎక్కువగా ఉందని గ్రామస్తులు చెబుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు చలి కూడా బాగా పెరిగిందని, చలిమంట కాగుతూ ఉపశమనం పొందుతున్నామన్నారు.

– మెంటాడ

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్



తమ సమస్యలు పరిష్కరించాలని మధ్యాహ్న భోజనం పథకం వంట కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. ఇదే విషయమై వారు బొబ్బిలిలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ఎదురుగా గురువారం ఆందోళనకు దిగారు. మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షురాలు వి.రామలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకుడు ఎస్.గోపాల్ వారి తరఫున కాసేపు మాట్లాడారు. వారికి రూ.10 వేల కనీస వేతనం ఇవ్వాలని, ఉచిత బీమా వర్తింపజేయాలని, గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇవ్వాలని, ఈ నెల 7వ తేదీన పాఠశాలల్లో జరిగే పేరెంట్స్ మీటింగ్‌కు హాజరవుతున్న వారికి భోజనం పెట్టేందుకు ఒక్కొక్కరికి రూ.30 చొప్పున అందజేయాలని కోరారు. కార్యక్రమంలో దుప్పాడ ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

– బొబ్బిలి

ఉపాధ్యాయులకు రక్షణ లేదు..



రాయచోటిలో ఉపాధ్యాయుడు ఇజాజ్ అహ్మద్‌ను విద్యార్థులు దాడి చేసి హతమార్చడాన్ని వ్యతిరేకిస్తూ బొబ్బిలిలోని బాలికోన్నత పాఠశాల వద్ద ఉపాధ్యాయులంతా గురువారం నిరసన చేపట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయ సిబ్బందికి రక్షణ లేదని, సదరు ఉపాధ్యాయుడిపై దాడి ఘటన వెనక ఉన్న నిందితులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ఉపాధ్యాయులకు రక్షణ కల్పించే చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఏపీటీఎఫ్ ఈవో మోహనరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎం.బలరాంనాయుడు, ఉపాధ్యక్షుడు సీహెచ్ రామారావు, జి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

– బొబ్బిలి

రైతులకు ఇబ్బంది కలగకుండా ధాన్యం కొనుగోళ్లు



అంబఖండిలో విక్రయానికి సిద్ధం చేసిన ధాన్యం పరిశీలిస్తున్న ఏవో మురళీకృష్ణ

రేగిడి: రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని ఏవో మురళీకృష్ణ సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు చేస్తున్న ధాన్యం విక్రయాలను ఆయన గురువారం పరిశీలించారు. మండలంలో ఇప్పటివరకు 410 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని, మరో 390 మంది రైతుల దగ్గర నుంచి 25 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లకు సన్నాహాలు చేస్తున్నామన్నారు.

పిల్లల్లో సృజనాత్మకతను పెంపొందించాలి



బొబ్బిలిరూరల్: పెంట గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న సిబ్బంది, చిన్నారులు



తెర్లాంలోని ఐదో అంగన్‌వాడీ కేంద్రంలో ఈసీసీఈ డే



రామభద్రపురం: కొండకెంగువలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఐసీడీఎస్ పీవో రాజ్యలక్ష్మి

తెర్లాం: అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్న ప్రీస్కూల్ పిల్లల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు ఈసీసీఈ(ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్) కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని స్థానిక శాఖా గ్రంథాలయం లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి, తెర్లాం–5 అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్త వై.శ్రీదేవిలు అన్నారు. స్థానిక ఐదో అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ బాడంగి పీవో కె.రాజ్యలక్ష్మి, తెర్లాం సెక్టార్ సూపర్‌వైజర్ ఉషారాణిల ఆదేశాల మేరకు ఈసీసీఈ డే(దినోత్సవం) గురువారం ఘనంగా నిర్వహించారు. వారు మాట్లాడుతూ పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్య, సంభాషణ, సృజనాత్మకత కార్యక్రమాలను ప్రతిరోజూ అందించడం జరుగుతోందన్నారు. క్రమం తప్పకుండా పిల్లలను ప్రీస్కూల్‌కు పంపించాలని తల్లిదండ్రులకు తెలిపారు.

బొబ్బిలిరూరల్: మండలంలోని అలజంగి, గొర్లె సీతారాంపురం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈసీసీఈ డే గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లల వికాసానికి సంబంధించి, ఐదు రకాల కార్డులు తయారు చేసి, ప్రదర్శించారు. చిన్నారుల శారీరక, మానసిక ఎదుగుదలకు కృషి చేయాలని ఐసీడీఎస్ పీవో జాగాన విజయలక్ష్మి కోరారు.

రామభద్రపురం: అంగన్‌వాడీ కేంద్రాల్లోని ప్రీస్కూల్ పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యనందించాలని ఐసీడీఎస్ బాడంగి పీవో కె.రాజ్యలక్ష్మి సూచించారు. మండలంలోని కొండకెంగువ–2 అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన ఈసీసీఈ డేలో ఆమె పాల్గొని, కాసేపు మాట్లాడారు. పిల్లల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ప్రీస్కూల్ ఎంతగానో దోహదపడుతుందన్నారు. ప్రతినెలా 5వ తేదీన అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈసీసీఈ డేను కార్యకర్తలు నిర్వహిస్తారని ఆమె చెప్పారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కృష్ణకుమారి, కార్యకర్త హేమ తదితరులు పాల్గొన్నారు.

జీఎంఆర్ ఐటీకి ఎల్‌అండ్‌టీ చైర్మన్ రాక రేపు

రాజాం సిటీ: స్థానిక జీఎంఆర్ ఐటీకి ఈ నెల 7వ తేదీన ఎల్‌అండ్‌టీ చైర్మన్ ఎస్.ఎన్.సుబ్రహ్మణ్యన్ రానున్నారని ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్ఎస్‌వీ ప్రసాద్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్య, ఆరోగ్యం, కార్పొరేట్ సామాజిక బాధ్యత అంశాలపై జీఎంఆర్‌వీఎఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రదర్శనలను ఆయన తిలకించనున్నారని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి కాసేపు ప్రసంగించనున్నారన్నారు. పారిశ్రామిక వేత్త గ్రంధి మల్లికార్జునరావు అధ్యక్షతన జరగనున్న ఈ కార్యక్రమానికి ట్రాన్స్ పోర్టేషన్ అండ్ అర్బన్ ఇన్‌ఫ్రా బిజినెస్ చైర్మన్ బీవీఎం రావు, ఎయిర్‌పోర్ట్ బిజినెస్ చైర్మన్ జీబీఎస్ రాజు, ఎనర్జీ అండ్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ బిజినెస్ చైర్మన్ బి.శ్రీనివాస్, జీఎంఆర్‌వీఎఫ్ సీఈవో అశ్వినిలోహని తదితరులు హాజరు కానున్నారన్నారు.

9న స్క్రాప్ వేలం

బాడంగి: మండల పరిషత్ కార్యాలయంలో తాగునీటి బోర్ల స్క్రాప్(పాడైన బోర్ల మెటీరియల్)కు సంబంధించి, ఈ నెల 9వ తేదీన వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎస్.రామకృష్ణ ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. ఉదయం 11 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి ఆసక్తి ఉన్న వారు హాజరు కావాలని కోరారు.